

విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం రమణమ్మ

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

బోరబండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గణితంలో సూత్రం అర్థమైతే ప్రతి లెక్కను విద్యార్థులు సులువుగా చేయవచ్చని గురుకుల రెసిడెన్షియల్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జి.రమణమ్మ అన్నారు. గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని బోరబండ గురుకుల బాలుర, బాలికల పాఠశాలలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన 100 సంవత్సరాల కాలమానం, మ్యాజిక్ స్కేల్‌తో పాటు పలు నమూనాలను హెచ్‌ఎం రమణమ్మ ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, జి.బాలకృష్ణ, బాలకిషన్‌రెడ్డి, స్రవంతి, లావణ్య, రజనీ పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో..

జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురుకుల బాలికల పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం మణిమాల అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, సరిత, దివ్య ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బోరబండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక వనరులను ప్రతీ మహిళ అందుకోవాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. శనివారం సైట్-1లోని షహీద్ తుర్రెబాజ్‌ఖాన్ సామాజిక భవన్‌లో జీహెచ్‌ఎంసీ, యూసీడీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పొదుపు సంఘాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారత సాధించాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం అన్నారు. అందుకు అనుగుణంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.



హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

నిమ్స్ జీరియాట్రిక్ విభాగంలో హెల్ప్ డెస్క్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ జీరియాట్రిక్ విభాగానికి వెళ్లేందుకు వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ వార్డు ఎక్కడ ఉందో, పరీక్షలు ఎక్కడ చేస్తారో తెలియక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి సాయం చేసేందుకు నిమ్స్ జీరియాట్రిక్ విభాగం వైద్యులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. హెల్పేజ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ జితేందర్‌తో జీరియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడి హెల్ప్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని శనివారం నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. వృద్ధులకు సాయం చేయడానికి ముందుకువచ్చిన హెల్పేజ్ ఇండియా ప్రతినిధులను ఆయన అభినందించారు. అయితే ఈ సహాయ కేంద్రంలో ఆస్పత్రికి వచ్చే వృద్ధులకు సాయం చేసేందుకు నలుగురు సామాజిక కార్యకర్తలు అందుబాటులో ఉండనున్నారు. ఓపీ, ఐపీ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, రిఫరల్ చేయడం, వార్డులకు తీసుకుపోవడం, కౌన్సెలింగ్ వంటి అంశాల్లో వారికి సాయం చేస్తారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వృద్ధాశ్రమాల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడే వృద్ధులను నిమ్స్‌కు తరలించే బాధ్యతను సైతం హెల్పేజ్ ఇండియా సామాజిక కార్యకర్తలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.



పురస్కారాలు అందుకున్న సుద్దాల అశోక్‌తేజ, మన్నం వెంకటరాయుడు.. చిత్రంలో వరప్రసాద్ రెడ్డి, రమణాచారి తదితరులు

భాషా సంస్కృతుల పరిరక్షకుడు 'వరప్రసాద్ రెడ్డి'

- సాహిత్య, సేవా రంగాల్లో సేవలను కొనియాడిన వక్తలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాణాధారమైన టీకాలను మానవాళికి అందించడమే కాకుండా, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణను ఒక మహోద్యమంలా నిర్వహిస్తున్న మానవతావాది శాంతా బయోటెక్స్ వ్యవస్థాపకుడు వరప్రసాద్‌రెడ్డి అని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కొనియాడారు. ఆయన ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తూ, సమాజంపై తన బాధ్యతను నిర్వర్తిస్తున్న సౌజన్యశీలి అని శ్లాఘించారు. శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు సభామందిరంలో మనసు ఫౌండేషన్ నిర్వాహకుడు మన్నం వెంకటరాయుడుకు 'వేంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న' పురస్కారాన్ని, ప్రఖ్యాత సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు 'డా.వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త' అవార్డును ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి చేతుల మీదుగా ప్రదానం చేశారు. రమణాచారి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు శాంత, వేంకటరమణారెడ్డి స్మారకంగా సాహితీమూర్తులు, కళాకారులను ప్రోత్సహిస్తూ అవార్డులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. భాషా సంస్కృతుల పట్ల అపారమైన గౌరవంతోనే సమాజానికి తమ వంతు బాధ్యతగా సేవలందిస్తోన్న కవులు, కళాకారులను గుర్తించి ఏటా సత్కరిస్తున్నామని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత వరప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఒకరిని ఖాళీ చేయిస్తే మరొకరు

- రహ్మత్‌నగర్ నుంచి శ్రీరామ్‌నగర్ వెళ్లే మార్గంలో మళ్లీ వెలుస్తున్న ఆక్రమణలు
- రోడ్డు విస్తరణ కోసం గతంలో గుడిసెలను తొలగించిన అధికారులు
- పనులు ఆలస్యం కావడంతోనే సమస్య అంటున్న స్థానికులు
- అధికారులు దృష్టి సారించాలని కోరుతున్న వాహనదారులు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ కోసం అక్కడున్న గుడిసెలను తొలగించారు. కేంద్ర ప్రభుత్వ స్థలాన్ని సేకరించి రోడ్డు విస్తరణకు సిద్ధం చేసి సుందరీకరణ పనులు సైతం చేపట్టారు. అయితే పనులు ఇంకా జరగనేలేదు కానీ అప్పుడే విస్తరణ కోసం సేకరించిన స్థలంలో దుకాణాలు వెలుస్తున్నాయి. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించకపోతే గతంలో ఖాళీ చేయించేందుకు ఎదురైన సమస్యలే మళ్లీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. ఓ వైపు అభివృద్ధి చేస్తామని చెబుతున్న అధికారులు ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యల్లో జాప్యం కారణంగా తొలగించిన ఆక్రమణల స్థానంలో దుకాణాలు వెలుస్తున్నాయి. దీంతో రహ్మత్‌నగర్ నుంచి శ్రీరామ్‌నగర్ వెళ్లే మార్గంలో వాహనదారులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

వందలాది మందికి పునరావాసం

యూసుఫ్‌గూడ నుంచి మోతీనగర్ వరకు రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చాలా ప్రదేశాల్లో స్థల సేకరణ చేశారు. అయితే రహ్మత్‌నగర్, శ్రీరామ్‌నగర్‌లలో మాత్రం పలు కారణాల వల్ల ఇంకా స్థల సేకరణ పూర్తి కాలేదు. రహ్మత్‌నగర్ నుంచి శ్రీరామ్‌నగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిమ్స్ మే స్థలం ముందు కాలిబాటలో గతంలో ఉన్న వందలాది గుడిసెలను తొలగించి వారికి సంగారెడ్డి జిల్లా బీరంగూడ వద్దనున్న నర్రెగూడెంలో పునరావాసం కల్పించారు. దీంతో పాటు నిమ్స్ మే స్థలాన్ని రోడ్డుకు ఇరువైపులా ఐదు అడుగుల మేర సేకరించి సుందరీకరణ పనులు చేపట్టారు. అయితే శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో స్థల సేకరణ పూర్తికాకపోవడంతో రద్దీవేళల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ కాస్త



రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు



ముబారక్ కేఫ్ వద్ద నిమ్స్ మే గ్రౌండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన దుకాణాలు

రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ చాలా సజావుగా సాగుతుందని వాహనదారులు ఎదురుచూస్తున్నారు.

ఆక్రమణలతో పనులు ఆలస్యమయ్యే అవకాశం

అయితే నిమ్స్ మే ప్రాంగణం ముందు ఉన్న రోడ్డు విస్తరణ కాలిబాట స్థలంలో పలువురు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ముబారక్ కేఫ్ సమీపంలో నిమ్స్‌మే గ్రౌండ్ ముందు ఒక దుకాణం పూర్తిగా తయారైంది. అధికారులు పట్టించుకోకుంటే రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, హోటల్స్ వెలిసేలా ఉన్నాయని, మళ్లీ వీరిని ఖాళీ చేయించేందుకు చాలా సమయం పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమై ముందుగానే ఆక్రమణలు జరగకుండా చూడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి ఇక్కడ వెలుస్తున్న దుకాణాలను కూల్చివేసి త్వరగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు అక్రమ పార్కింగ్‌తో సైతం ఇక్కడ సమస్యలు తలెత్తుతున్నాయి.

మా భూములను కబ్జా చేశారు

- నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్
- ప్రభుత్వం స్పందించకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరిక



సమావేశంలో పాల్గొన్న బాధితులు, గిరిజన సంఘాల నాయకులు

పంజాగుట్ట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములను, సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న రెండు ప్రముఖ నిర్మాణ సంస్థలపై హైడ్రా అధికారులు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ పంచాయతీ పరిధిలోని కొండకల్ తండా, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమల తండాలో గిరిజనుల భూములను ఆక్రమించారని, ప్రభుత్వం స్పందించకుంటే వేలాదిమందితో ఇందిరా పార్కు వద్ద భారీ ధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. తమపై దాడులకు పాల్పడటంతో పాటు సదరు నిర్మాణ సంస్థలు అక్రమ కేసులు బనాయిస్తున్నాయని బాధితులు ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రాంబాల్ నాయక్, బాధితులు మాట్లాడారు. తమ ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన అసైన్డ్ భూములను కబ్జా చేసిన నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని బాధితులు విజ్ఞప్తి చేశారు. తమ ఫిర్యాదు మేరకు విక్రమ్‌రెడ్డి, లచ్చిరెడ్డి, ఉదయ్ కిరణ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌లపై కేసు నమోదైనా వారిని ఎందుకు అరెస్టు చేయడంలేదని ప్రశ్నించారు.

కేసుల విచారణలో సమన్వయం అవసరం

- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కె.శ్రీనివాస్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కె.శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేసుల విచారణలో పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమన్వయంతో వ్యవహరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం లా కాలేజీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీ క్రైం సీన్ ఇన్వెస్టిగేషన్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి న్యాయ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. గతంలో పోలీస్తే క్రైం సీన్ విచారణ చేసే విషయంలో చాలా మార్పులు వచ్చాయన్నారు. ఒకప్పుడు సరైన సాంకేతిక పరిజ్ఞానం ఉండేది కాదని, ఇప్పుడు అత్యాధునిక పరికరాలు, టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. దీంతో నేరస్తులు తప్పించుకోవడం సాధ్యం కావడం లేదన్నారు. క్రైం ఇన్వెస్టిగేషన్‌లో ఐవో, ఎఫ్ఎస్ఎల్, పీపీ విభాగాల అధికారులు సమన్వయంతో ఉంటే నేరస్తులకు శిక్ష పడటంతో పాటు బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. న్యాయ విద్యార్థులు తమ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు మార్చుకోవాలని, ఎంతో సహనంతో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు కేసులను ఇన్వెస్టిగేషన్ చేసిన తీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫోరెన్సిక్ డీడీ శారద అవధానం, దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ నందిని, సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ పాల్గొన్నారు.



2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు 2కే రన్

ఖైరతాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై నిఘా పెడుతూ చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాలని పద్మభూషణ్ కోడూరు ఈశ్వర వరప్రసాద రెడ్డి సూచించారు. శనివారం తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ 2కె రన్‌ను పాలకుర్తికి చెందిన ఝాన్సీ రాజేందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ మానవ జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న పోలీస్, ఎక్సైజ్ శాఖలకు ప్రజలు సహకరించాలని సూచించారు. జలవిహార్ నుంచి ప్రారంభమైన 2కే రన్‌లో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తారక్ రవి, సి.గణేష్, అశోక్, సంతోష్, మహేందర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాక్ ఫర్ హ్యుమానిటీ

అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం పీవీ నర్సింహారావు మార్గ్‌లో స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ హ్యుమానిటీ కార్యక్రమం నిర్వహించారు. గురు విశ్వస్ఫూర్తి ఆధ్వర్యంలో స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ ఏర్పడి మూడేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 29న అమీర్‌పేటలోని కమ్మ సంఘంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాక్‌లో స్ఫూర్తి కుటుంబ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రతి మనిషిలో మానవత్వం పెంపొందాలని నినాదాలు చేశారు. వెంకటేశ్వర్‌రావు, గోపాల్ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

- నగర ప్రజలకు వల వేస్తున్న నేరగాళ్లు
- భారీ మొత్తంలో డబ్బు పోగొట్టుకుంటున్న బాధితులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే సోలార్ ప్యానెళ్లు విక్రయిస్తామంటూ ఫేస్‌బుక్‌లో ప్రకటన చూసిన ఎస్ఆర్‌నగర్‌కు చెందిన వ్యాపారి (45) వారిని సంప్రదించాడు. రూ.5 లక్షలకే ఇంటి అవసరాలకు సరిపోయే సోలార్ ప్యానెళ్లు ఇస్తామని చెప్పడంతో వారు సూచించిన ఖాతాకు డబ్బు పంపించాడు. సోలార్ ప్యానెళ్లు పంపకపోగా, మరికొంత డబ్బు పంపమని డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోని రూ.4,65,858లను ఫ్రీజ్ చేయించారు. వేగంగా స్పందించి బాధితుడి డబ్బు కాపాడిన మహిళా హెడ్ కానిస్టేబుల్ దీనాను సీపీ సీవీ ఆనంద్ అభినందించారు

పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో..

పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో మహిళ(26)ను సంప్రదించిన సైబర్ నేరగాళ్లు పెట్టుబడి పెట్టి పనిచేస్తే లాభాలు వస్తాయని నమ్మించి రూ.1.74 లక్షలు వసూలు చేశారు. పార్ట్‌టైం జాబ్ అంటూ టెలిగ్రాం గ్రూపులో ఆమెను చేర్చిన నేరగాళ్లు టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బులు ఇస్తామని చెప్పారు. మొదట ఆమె ఖాతాలో రూ.850 జమ చేయడంతో, ఆ తర్వాత పలు దఫాలుగా రూ.1.74 లక్షలు పంపించింది. అయితే టాస్క్‌లు పూర్తి చేసినా డబ్బులు రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది.

పోయిన నగదు రికవరీ..

ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన సైబర్ క్రైం అధికారులు మోసగాళ్లు కాజేసిన మొత్తంలో కొంతమేర రికవరీ చేసి బాధితుడికి అందించారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి(37)ని స్టాక్ ట్రేడింగ్‌లో లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ నేరగాళ్లు పలు దఫాలుగా రూ.7.25 లక్షలు వసూలు చేశారు. మళ్లీ డబ్బు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బ్యాంక్ అధికారుల సాయంతో సైబర్ నేరగాళ్ల ఖాతాలో ఉన్న రూ.5.25 లక్షలు ఫ్రీజ్ చేయించారు. న్యాయస్థానంలో బాధితుడితో ఫిర్యాదు చేయించి, కోర్టు ఆదేశాలతో రూ.5.25 లక్షలు బాధితుడి ఖాతాలో జమయ్యేలా చేశారు.

గూగుల్ రివ్యూ పేరుతో రూ.1.33 లక్షల లూటీ..

నేరేడ్‌మెట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌కు చెందిన ప్రవేటు ఉద్యోగికి ఈ నెల 18న టెలిగ్రామ్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి రెస్టారెంట్లు, హోటల్స్, పబ్బులకు రివ్యూ ఇస్తే డబ్బులిస్తామని చెప్పారు. మొదట నమ్మకం కలిగేందుకు డబ్బు పింపిన సైబర్ నేరగాళ్లు డబ్బులు చెల్లిస్తే ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పడంలో రూ.1.33 లక్షలు పంపించాడు. ఈ మొత్తం డబ్బుకు రూ.2,19,000 ఇస్తామని నమ్మించి అదనపు బోనస్ కోసం మరో రూ.2.5 లక్షలు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు కోరారు. అయితే అతడు డబ్బు పంపకపోవడంతో అతడి అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారు. దీంతో బాధితుడు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సందీప్‌కుమార్ తెలిపారు.

అదుపు తప్పి డివైడర్ ఎక్కిన కారు

బంజారాహిల్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పిన కారు డివైడర్ ఎక్కింది. శనివారం బంజారాహిల్స్ నుంచి రోడ్డు నంబర్ 10 మీదుగా వెళ్తున్న ఓ ఇన్నోవా కారు ఒక్కసారిగా అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కి ఆగింది. దీంతో కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలు కావడంతో స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు. కారు యజమాని ఎవరు, నడిపింది ఎవరు అనే విషయాలపై బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రోలో మహిళల భద్రతకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

వరకు మహిళా కెప్టెన్ల ద్వారా ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని అందిస్తే ఆ వర్గానికి చెందిన ప్రయాణికులకు మరింత ధైర్యం, అనుకూలత ఉంటుందన్నారు. నగరంలో మెట్రో రెండోదశ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఓల్డ్ సిటీలో త్వరలో కూల్చివేత పనులను ప్రారంభిస్తామన్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 1100 ఆస్తులు మెట్రో నిర్మాణంలో పోతున్నాయని, ఆస్తులు కోల్పోతున్నవారికి గజానికి రూ.81వేల పరిహారం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

గ్రీన్ ట్యాక్సీలు తీసుకొస్తాం: వరదరాజన్

రానున్న రోజుల్లో నగరంలో ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కింద మెట్రో స్టేషన్ల నుంచి రోజుకు 2 లక్షల మందికి సేవలందిస్తామని ఎల్‌అండ్‌టీ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీవరదరాజన్ అన్నారు. ప్రధానంగా గ్రీన్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకొచి కాలుష్యాన్ని అరికట్టేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఎల్‌అండ్‌టీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రిషివర్మ మాట్లాడుతూ 2021లో ర్యాపిడో సంస్థతో తాము ఒప్పందం చేసుకున్నామని, ప్రస్తుతం రోజుకు 45వేల మంది ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని సేవలు పొందుతున్నారని, రానున్న రోజుల్లో 75వేల మంది వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు. ర్యాపిడో కోఫౌండర్ పవన్ మాట్లాడుతూ.. నగరంలో బైక్‌లు, ఆటోలు, కార్ల ద్వారా తాము ప్రతిరోజు 2.7 లక్షల మందికి సేవలందిస్తున్నట్లు చెప్పారు. మెట్రో స్టేషన్ల నుంచి 0-3 కిలోమీటర్ల వరకు 30, 3-4 కిలోమీటర్లకు రూ.40, 4-5 కిలోమీటర్లకు రూ.50 చొప్పున చార్జీలను తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ అధికారులు, ర్యాపిడో సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు దుప్పట్ల పంపిణీ

ఎర్రగడ్డ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సేవే పరమావధిగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మానవ సేవ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బుచ్చిబాబు అన్నారు. ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఆయన దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు, దుప్పట్ల పంపిణీ వంటి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానసిక ఆస్పత్రిలోని రోగులకు 200 దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు కమల్ , ప్రియాంక, హారిక తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్ అనితకు దుప్పట్లను అందజేస్తున్న బుచ్చిబాబు



సమావేశంలో పాల్గొన్న గృహకార్మికులు

గృహ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

బౌద్ధనగర్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలో గృహ కార్మికులకు ఇళ్లు కేటాయించాలని సామాజిక శాస్త్రవేత్త, లీగల్ అడ్వయిజర్, లైఫ్‌కోచ్ పులిగిల్ల వీరమల్లు యాదవ్ డిమాండ్ చేశారు. ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం వారాసిగూడలోని గృహ కార్మిక యూనియన్ తెలంగాణ స్టేట్ హైదరాబాద్ జిల్లా ఫీల్డ్‌వర్కర్స్ కో-ఆర్డినేటర్ వల్లాల మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోని గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, గీతాంజలి, స్వాతి, మాధవి, సబిత, శోభ, మాధురి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ రామమోహనరావు, పట్టాభి, ప్రిన్సిపల్ నాగరాణి

బాగా చదువుకుంటే బంగారు భవిష్యత్తు

మారేడుపల్లి, డిసెంబర్ 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ మునగ రామమోహన్ రావు అన్నారు. శనివారం మారేడుపల్లిలోని మునగా రామమోహన్ రావు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన వీడ్కోలు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోను రాణించాలని సూచించారు. అనంతరం పారిశ్రామికవేత్త తాటికొండ పట్టాభితో కలిసి ఆయన చదువులో ప్రతిభ కనబర్చుతున్న కళాశాల విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను వారు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తి చేయాలి: సీపీఎం

అడ్డగుట్ట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలో ఐదేళ్ల క్రితం మధ్యలోనే నిలిపివేసిన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి అజయ్ బాబు డిమాండ్ చేశారు. పనులను మధ్యలోనే నిలిపివేసినందుకు నిరసనగా శనివారం సీపీఎం నాయకులతో కలిసి ఆయన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్ నిర్మిస్తామంటూ ఐదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అడ్డగుట్టలోని కమ్యూనిటీహాల్‌ను కూలగొట్టారని తెలిపారు. మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మధ్యలోనే పనులను నిలిపివేశారన్నారు. కమ్యూనిటీ హాల్ అందుబాటులో లేకపోవడంతో పేదలు శుభకార్యాలు చేసుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులను పునర్ ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, ఆర్. మల్లేష్, బాలయ్య, ఎల్లయ్య, అనిల్, ప్రశాంత్, చారి, భారతమ్మ, ఫాతీమా పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే తలసాని

మారేడుపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శనివారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో మోండా డివిజన్‌కు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, ప్రమోద్, నందు తదితరులు ఉన్నారు.

పవర్ బోర్‌కు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి

అడ్డగుట్ట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ పరిధిలోని గడ్డమీది బస్తీలో పవర్ బోర్‌కు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరుతూ బస్తీవాసులతో పాటు అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు రమాదేవి, కేఎన్ సుధాకర్‌లు శనివారం లాలాగూడ ఏఈకి వినతి పత్రం సమర్పించారు. తమ బస్తీలో గతంలో ఉన్న పవర్ బోర్ పూర్తిగా చెడిపోవడంతో ఓ స్వచ్ఛంద సంస్థ ఈ పవర్ బోర్‌కు మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చిందన్నారు. అయితే ఈ బోర్‌కు త్రీఫేజ్ కరెంటు అవసరం కావడంతో లాలాగూడ ఏఈకి వినతి పత్రం సమర్పించామని, అదే విధంగా స్థానిక కార్పొరేటర్‌కు కూడా ఒక వినతి పత్రం సమర్పించామని చెప్పారు. మరో రెండు నెలల్లో ఎండకాలం రానున్న దృష్ట్యా ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఈ పవర్‌బోర్‌కు త్రీఫేజ్ కరెంటు ఇవ్వాలని అధికారులను కోరారు.

భూభారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు

- రాష్ట్ర కురుమ సంఘం నేత డా. కంకల్ ఏలేందర్

తార్నాక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని రైతులకు మేలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఓఆర్ 2024 భూభారతి చట్టాన్ని తీసుకురావడం పట్ల తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం నాయకులు డా. కంకల్ ఏలేందర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం తార్నాకలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి చట్టంలోని లోపాలను సవరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణలోని రైతులకు, ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని భూముల పరిరక్షణతో పాటు, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి కూడా భూభారతి చట్టం ఉపయోగపడుతుందన్నారు.

ఆహార ఉత్పత్తుల పేరుతో మందుల విక్రయం

- స్వాధీనం చేసుకున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తులు, న్యూట్రాస్యూటిక్స్ పేరుతో మందులను అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్న సంస్థపై ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దాడులు చేసి మందుల నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్‌లోని పికెట్ మార్కెట్‌లో కాల్డ్‌ఫెర్ డ్రాప్స్ హైడ్రాక్సైడ్ పాలీమాల్టోస్ కాంప్లెక్స్ డ్రాప్స్ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్టు గుర్తించారు. వీటిని పంజాబ్‌లో తయారు చేసి నగరంలో సేల్ చేస్తున్నట్టు గుర్తించారు. ఈ తనిఖీల్లో 3.2 లక్షల రూపాయల సొత్తును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శిగా రవీందర్



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శిగా రెండోసారి రవీందర్ నియమితులయ్యారు. శనివారం యూనియన్ కొత్త కమిటీలను ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు ప్రకటించారు. డివిజన్ అధ్యక్షుడిగా షేక్ ఖాజాబాబా , అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శులుగా చిలుకు స్వామి, శ్రీనివాస్, నాగలక్ష్మి, రమేష్ కుమార్ జోనల్ కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, నవనీత్ సింగ్ ఎన్నికయ్యారు.

ఆరు నెలలుగా నీటి కోసం అవస్థలు

బీదలబస్తీలో పని చేయని పవర్‌బోర్

మరమ్మతులపై జలమండలి అధికారులు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం

బౌద్ధనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలో పవర్‌బోర్‌వెల్ పని చేయకపోవడంతో బస్తీవాసులు ఆరు నెలలుగా నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. బోర్‌వెల్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా వారు కూడా పెడచెవిన పెడుతున్నారని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీదలబస్తీలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని 2015లో సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను బస్తీవాసులు కోరగా, ఆయన వెంటనే పవర్ బోర్‌వెల్ వేయించారు. బస్తీలో ఉండే కొన్ని వందల మంది నీటి అవసరాలను ఈ బోర్‌వెల్ తీర్చింది. దీంతో స్థానికులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

మరమ్మతులకు నోచుకోక...

పవర్ బోర్‌వెల్ పాడైపోవడంతో ఆరు నెలలుగా స్థానికులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. బోర్‌వెల్ పని చేయడం లేదని స్థానికులు సీతాఫల్‌మండి జలమండలి కార్యాలయంలో మేనేజర్‌కు, మారేడుపల్లిలో డీజీఎం, జీఎంకు ఫిర్యాదు చేశారు. దీంతో జలమండలి సిబ్బంది వచ్చి పవర్‌బోర్‌వెల్‌ను పరిశీలించారు. మోటర్ చెడిపోయిందని చెప్పి వెళ్లిన వారు మరల మరమ్మత్తులు చేయటానికి మాత్రం రాలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవర్ బోర్‌కు మరమ్మతుల చేయించి సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్‌తో పాటు ఎమ్మెల్యేను కోరినా వారు కూడా పెడచెవిన పెట్టారని బీదల బస్తీవాసులు వాపోతున్నారు. ప్రస్తుత శీతాకాలంలోనే నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, మరో మూడు నెలలు పోతే వేసవికాలం ప్రారంభమవుతుందని, అప్పుడు నీటి కోసం మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీదలబస్తీలో నిరూపయోగంగా ఉన్నా పవర్‌బోర్‌వెల్‌కు మరమ్మత్తులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరించాలని బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బీదలబస్తీలో పనిచేయని పవర్‌బోర్‌వెల్

మా బస్తీ అంటే చిన్నచూపు



బీదలబస్తీ అంటే అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారు. మా బస్తీలో నెలకొన్న సమస్యలను అసలు పట్టించుకోవడం లేదు. ఆరు నెలలుగా ఇక్కడి పవర్‌బోర్ పని చేయక బస్తీవాసులు నీటి కోసం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. మా బస్తీలో పారిశుధ్య పనులను కూడా సరిగా నిర్వహించడంలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పవర్ బోర్‌వెల్‌కు మరమ్మత్తులు చేయించడంతో పాటు బస్తీలోని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా.

-నందారం సీతారాం, బీదలబస్తీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు

దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నాం..



బీదలబస్తీలోని పవర్‌బోర్ పని చేయకపోవటంతో మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. పవర్‌బోర్‌కు మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్‌తో పాటు పలుమార్లు సీతాఫల్‌మండి జలమండలి కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పవర్‌బోర్‌కు మరమ్మత్తులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- వి.లలిత, బీదలబస్తీ

క్రియా యోగ ధ్యానంతో సాఫల్యవంతమైన జీవితం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు స్వామి స్మరణానంద

- స్వామి స్మరణానంద

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన భారతీయ రుషీ పరంపర నుంచి వరంగా వచ్చిన సనాతన క్రియాయోగ ధ్యానం అభ్యసించడం ద్వారా ఆనందకరమైన, సాఫల్యవంతమైన జీవితం సాధ్యమని యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు స్వామి స్మరణానంద తెలిపారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని ఆర్య వైశ్య అభ్యుదయ సంఘం హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామి స్మరణానంద ప్రసంగించారు. క్రియాయోగం శాస్త్రీయమైందని, దీని అభ్యాసం ద్వారా శాస్త్రీయ ఫలితాలు సాధ్యమని, క్రమబద్ధంగా ఈ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతతో పాటు భగవదాన్వేషణలో సత్వర పురోగతి సాధ్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు, క్రియా యోగులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి విజ్ఞాన్ వేదిక ఆడిటోరియంను ప్రారంభిస్తున్న సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

విద్యార్థులు దేశ గౌరవ ప్రతిష్టలను పెంచాలి

- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

మారేడుపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశ గౌరవ ప్రతిష్టలను ఇనుమడింపజేయలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన అన్నారు. మారేడుపల్లి, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఎలక్ట్రానిక్ విభాగం (జీఐఓఈ) ఆవరణలో 1987 బ్యాచ్ అలుమినీ అడ్‌హాక్ కమిటీ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో దాదాపు రూ.70 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన విజ్ఞాన్ వేదిక ఆడిటోరియంను కమిషనర్ ప్రారంభించారు. అలూమినీ అడ్‌హాక్ కమిటీ పూర్వవిద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణతో కలిసి కమిషనర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి కమిషనర్ మాట్లాడారు.విద్యార్థులందరూ బాగా చదువుకోవడంతో పాటు మంచి సంస్కారం కలిగి ఉండాలని, వీలైనంత వరకు మన దేశంలోనే ఉండి మన దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. మాతృ సంస్థపై ఎంతో అభిమానంతో ఆడిటోరియం పునర్నిర్మాణంలో భాగస్వాములైన పూర్వ విద్యార్థులను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బీటీఈటీ కార్యదర్శి పుల్లయ్య, అడ్‌హాక్ కమిటీ మెంబర్స్ రాంబాబు, చందు, రమేష్, చంద్ర శేఖర్, కుమార్, జగదీష్, తాతారావు పాల్గొన్నారు.

రైల్వేలో ఘనంగా పెన్షనర్స్ డే



సమావేశంలో పాల్గొన్న రామకృష్ణాచార్యులు, డా.నిర్మలా రాజారాం తదితరులు

చిలకలగూడ, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్‌నిలయం ఆడిటోరియంలో శనివారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్‌సీ రామకృష్ణాచార్యులు మాట్లాడుతూ, పెన్షనర్స్ డే అవశ్యకతను వివరించారు. పాత పెన్షన్ విధానం అమలు, కరోనా సమయంలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లింపు, ఆదాయపు పన్ను మినహాయింపు, మెడికల్ అలవెన్స్ పెంపు తదితర డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం మాట్లాడుతూ, రైల్వే ఆసుపత్రులలో పెన్షనర్లకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. 75సంవత్సరాలు నిండిన వారికి ఎటువంటి క్యూ లేకుండా సేవలందించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ జీఆర్ఎస్ రావు, డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్(జి)లు మాట్లాడుతూ, రైల్వే పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ అందజేయటానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఉత్తమ సేవలందజేసిన వారిని సత్కరించారు. దమరైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఏజీకే మూర్తి, రాజేందర్, చటర్జీ, జైపాల్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నాయకులు

తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి

సికింద్రాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నట్లు టీడీపీ మల్కాజగిరి లోక్‌సభ నియోజకవర్గ అడ్‌హాక్ కమిటీ సభ్యులు జె.నర్సింగరావు తెలిపారు. కంటోన్మెంట్ మూడో వార్డులో శనివారం జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్ని వార్డుల్లో టీడీపీని బలోపేతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, అనురాధ, బొట్టు మల్లేష్, రాజేష్, శ్యామ్‌కుమార్, విమల తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి చందనంతో అలంకరణ, ప్రత్యేక పూజలు

బోయిన్‌పల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలోని బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలో ప్రసిద్ధి చెందిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటల నుంచి సేవ కాలం తిరుప్పావై ప్రవచనాలు తిరుమల పల్లెర్లమూడి సువర్చే గావించబడుతున్నాయి. బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్, ఓల్డ్ బోయిన్‌పల్లి, బాలానగర్, బాలంరాయి, ఆర్ఆర్ నగర్ ప్రాంతాల నుంచి ప్రతి రోజూ తెల్లవారు జామునే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి తిరుప్పావై వ్రతాన్ని ఆచరిస్తున్నారు. కాగా, శనివారం ఆలయంలోని మూలవిరాట్ వెంకటేశ్వరస్వామిని పది కిలోల చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి చుట్టూ మంచుకొండలు ఉన్నట్లుగా దూదితో అలంకరించిన విధానం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నా రు. అనంతరం గోదాదేవి అమ్మవారికి భక్తులు పూలు, పండ్లు, గాజులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, లక్ష్మణ్, యాదయ్య, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



చందనం అలంకరణతో భక్తులకు దర్శనం ఇస్తున్న బోయిన్‌పల్లి వెంకటేశ్వరస్వామి

రాజీవ్ రహదారిలో భూసేకరణపై స్టేటస్ కో

- ఆస్తుల సేకరణ 10 రోజులు నిలివేయాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు (ఆంధ్రజ్యోతి):సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి శామీర్‌పేట వెళ్లే మార్గంలో రాజీవ్ రహదారిపై నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం చేస్తున్న భూసేకరణపై హైకోర్టు శనివారం యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) భూసేకరణ పనులను చేపట్టింది. ఇందుకోసం రోడ్ల విస్తరణ పనులను నిర్వహిస్తుండటంతో ఆస్తులు కోల్పోతున్న వారిలో కొంత మంది హైకోర్టును ఆశ్రయించారు. బాధితుల పిటిషన్లను విచారించిన హైకోర్టు భూసేకరణ పనులు చేయవద్దని, పది రోజుల పాటు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ ఫెడరేషన్ జేఏసీ కన్వీనర్ తేలుకుంట సతీష్ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వం రాజీవ్ రహదారిలో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే తమ ఆస్తుల సేకరణ చేసి ఇస్తున్న పరిహారం న్యాయబద్ధంగా లేదన్నారు. అదేవిధంగా ఎలివేటెడ్ కారిడార్ కోసం 200 అడుగుల వెడల్పుతో కాకుండా 100-120 అడుగులతో రోడ్డు విస్తరణ చేయాలని కోరుతున్నామన్నారు. ఇలా చేస్తే తమ ఆస్తులు కోల్పోకుండా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హెచ్ఎండీఏ అధికారులకు అందజేశామని ఆయన తెలిపారు.

భాషా సంస్కృతుల పరిరక్షకుడు 'వరప్రసాద్ రెడ్డి'

- సాహిత్య, సేవా రంగాల్లో సేవలను కొనియాడిన వక్తలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాణాధారమైన టీకాలను మానవాళికి అందించడమే కాకుండా, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణను ఒక మహోద్యమంలా నిర్వహిస్తున్న మానవతావాది శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు వరప్రసాద్‌రెడ్డి అని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కొనియాడారు. ఆయన ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తూ, సమాజంపై తన బాధ్యతను నిర్వర్తిస్తున్న సౌజన్యశీలి అని శ్లాఘించారు. శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు సభామందిరంలో మనసు ఫౌండేషన్ నిర్వాహకుడు మన్నం వెంకటరాయుడుకు 'వేంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న' పురస్కారాన్ని, ప్రఖ్యాత సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు 'డా.వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త' అవార్డును తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారుడు కేవీ రమణాచారి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ తల్లిదండ్రులు శాంత, వేంకట రమణారెడ్డి స్మారకంగా సాహితీమూర్తులు, కళాకారులను ప్రోత్సహిస్తూ అవార్డులు ఇవ్వడం గొప్పవిషయం అని ప్రశంసించారు. భాషా సంస్కృతుల పట్ల అపారమైన గౌరవంతోనే సమాజానికి తమ వంతు బాధ్యతగా సేవలందిస్తోన్న కవులు, కళాకారులను గుర్తించి, ఆ సేవామూర్తులను ప్రతి ఏటా సత్కరిస్తున్నామని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత వరప్రసాద్ రెడ్డి తెలిపారు. మనసు ఫౌండేషన్ ద్వారా మన్నం వెంకటరాయుడు చేస్తున్న సాహిత్య కృషి అనితరసాధ్యమైనది అంటూ కొనియాడారు. సుద్దాల అశోక్‌తేజ పాటలకు తాను అభిమాని అని వరప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధానకార్యదర్శి జె.చెన్నయ్య, శాంతా వసంతా ట్రస్ట్ కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు



శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో సుద్దాల అశోక్‌తేజ, మన్నం వెంకటరాయుడుకు పురస్కారాల ప్రదానోత్సవం.. చిత్రంలో వరప్రసాదరెడ్డి, రమణాచారి తదితరులు

మెట్రోలో మహిళల భద్రతకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

వరకు మహిళా కెప్టెన్ల ద్వారా ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని అందిస్తే ఆ వర్గానికి చెందిన ప్రయాణికులకు మరింత ధైర్యం, అనుకూలత ఉంటుందన్నారు. నగరంలో మెట్రో రెండోదశ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఓల్డ్‌సిటీలో త్వరలో కూల్చివేత పనులను ప్రారంభిస్తామన్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 1100 ఆస్తులు మెట్రో నిర్మాణంలో పోతున్నాయని, ఆస్తులు కోల్పోతున్నవారికి గజానికి రూ.81వేల పరిహారం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

గ్రీన్ ట్యాక్సీలు తీసుకొస్తాం: వరదరాజన్

రానున్న రోజుల్లో నగరంలో ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కింద మెట్రో స్టేషన్ల నుంచి రోజుకు 2 లక్షల మందికి సేవలందిస్తామని ఎల్‌అండ్‌టీ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీవరదరాజన్ అన్నారు. ప్రధానంగా గ్రీన్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకొచి కాలుష్యాన్ని అరికట్టేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఎల్‌అండ్‌టీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రిషివర్మ మాట్లాడుతూ 2021లో ర్యాపిడో సంస్థతో తాము ఒప్పందం చేసుకున్నామని, ప్రస్తుతం రోజుకు 45వేల మంది ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని సేవలు పొందుతున్నారని, రానున్న రోజుల్లో 75వేల మంది వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు. ర్యాపిడో కోఫౌండర్ పవన్ మాట్లాడుతూ.. నగరంలో బైక్‌లు, ఆటోలు, కార్ల ద్వారా తాము ప్రతిరోజు 2.7 లక్షల మందికి సేవలందిస్తున్నట్లు చెప్పారు. మెట్రో స్టేషన్ల నుంచి 0-3 కిలోమీటర్ల వరకు 30, 3-4 కిలోమీటర్లకు రూ.40, 4-5 కిలోమీటర్లకు రూ.50 చొప్పున చార్జీలను తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ అధికారులు, ర్యాపిడో సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటిన తార్నాక విద్యార్థులు

తార్నాక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఈ నెల 14, 15న జరిగిన అంతర్జాతీయ స్థాయి అబాకస్ మెంటల్ అర్థమేటిక్ పోటీల్లో తార్నాకలోని అబాకస్ (యూసీమాస్) సెంటర్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కబర్చిచారు. ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుంచి సుమారు 6 వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, తార్నాకలోని అబాకస్ సెంటర్‌కు చెందిన ఆశ్లేష, లేఖ్యశ్రీ, కృష్ణ సాత్విక్‌లు వివిధ క్యాటగిరీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులను శనివారం తార్నాకలోని అబాకస్ (యూసీమాస్) సెంటర్ ఇన్‌చార్జి శోభారాణి అభినందించారు.